నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న కార్పొరేటర్ ఫహద్ బిన్ అబ్దాద్

చాంద్రాయణగుట్ట: సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని ఉప్పుగూడ కార్పొరేటర్ ఫహద్ బిన్ అబ్దాద్ అన్నారు. సోమవారం రాత్రి జరిగిన ఉప్పుగూడ రాజీవ్ గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఉప్పుగూడ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానన్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఎస్.రఘు నేత, ఉపాధ్యక్షుడిగా జె.వెంకట్ నాయక్, ఎ.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా టి.బాబు చారి ఎన్నికయ్యారు.

తెలంగాణ సంక్షేమ రాష్ట్రం



గోల్కొండ: తెలంగాణ సంక్షేమ రాష్ట్రం అని అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు మిత్ర కృష్ణ మంగళవారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆయన వెంట రాంచందర్, విజయ్‌ముదిరాజ్, ఉమేష్ తదితరులున్నారు.

పులికంటి నరేష్‌కు దళిత రత్న



అవార్డు అందుకుంటున్న నరేష్

చాంద్రాయణగుట్ట: కందికల్ గేట్ ప్రాంతానికి చెందిన ఎస్సీ అభివృద్ధి సంఘం వ్యవస్థాపకుడు పులికంటి నరేష్ దళితరత్న అవార్డును అందుకున్నారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా రవీంద్రభారతీలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ జయంత్యుత్సవాల కమిటీ ఎంపిక చేయగా, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదరం రాజనర్సింహా ఆయనకు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఉత్సవాల కమిటీ సభ్యులు మాట్లాడుతూ..బడుగు, బలహీన వర్గాల ఆర్థిక అభ్యున్నతికి నరేష్ దశాబ్ద కాలంగా సేవలందిస్తున్నారన్నారు. యువతకు వృత్తి పనుల్లో శిక్షణ ఇప్పించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌కు శుభాకాంక్షలు



అబిడ్స్: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం నియోజకవర్గ సీనియర్ నాయకులు ఆల పురుషోత్తం రావు ఎమ్మెల్యే రాజాసింగ్‌ను ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నిషేధిత ఇంజక్షన్లను విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్

గౌలిపురా: ఎలాంటి లైసెన్స్ లేకుండా మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లను విక్రయిస్తున్న ముగ్గురిని మొఘల్‌పురా పోలీసులు అరెస్ట్ చేసి ఇద్దరిని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శాలిబండ ప్రాంతానికి చెందిన సయ్యద్ అసద్ (28) ఆన్‌లైన్‌లో ఇండియా మార్ట్ ద్వారా మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు కొనుగోలు చేసి స్వయంగా వినియోగించేవాడు. ఈ ఇంజక్షన్లను తక్కువ సమయంలో కండలు పెరిగేందుకు వినియోగించేవాడు. ఇందులో భాగంగా తనకు తెలిసిన బాలాపూర్‌కు చెందిన అహ్మద్ ఖురేషి (30), లిఫ్ట్ మెకానిక్ బాలుడు (17)లకు హరిబౌలి చౌరస్తా వద్ద సయ్యద్ అసద్ ఈ ఇంజెక్షన్లు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయమైన సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్ ఫోర్స్ పోలీసులు మొఘల్‌పురా పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సయ్యద్ అసద్, అహ్మద్ ఖురేషితో పాటు మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకొని తదుపరి విచారణ నిమిత్తం మొఘల్‌పురా పోలీసులకు అప్పగించారు. దీంతో మొఘల్‌పురా పోలీసులు అసద్, అహ్మద్ ఖురేషిలను అరెస్ట్ చేసి 102 మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు, మూడు సెల్‌ఫోన్లు, 2 సూదులు మొత్తం రూ.1.20 లక్షల విలువ చేసే వస్తువులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కాగా మైనర్ బాలున్ని జువైనల్ హోమ్‌కు తరలించారు.

జూ చూసొద్దాం

సందర్శన టికెట్ రేట్లు పెరిగినా..తగ్గని ఆదరణ

ఆన్‌లైన్ బుకింగ్‌తో క్యూకు ఫుల్‌స్టాప్

నావిగేషన్ యాప్‌తో గైడ్ లేకుండానే సులువుగా జూ సందర్శన



సరస్సులో ఆకట్టుకుంటున్న కొంగలు

చార్మినార్: పాతబస్తీలోని నెహ్రూ జులాజికల్ పార్కును సందర్శించడానికి చిన్నారులతో పాటు పెద్దలు సైతం ఇష్టపడుతున్నారు. జూ సందర్శనకు ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ చాంతాడంత క్యూ లైన్‌లకు ఫుల్‌స్టాప్ పడింది. జూ సందర్శకులకు పలు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. అందుకే టికెట్ రేట్లు పెరిగినా.. ఆదరణ తగ్గలేదు. అంతేకాకుండా మనం ఎక్కడి నుంచైనా జూ సందర్శన టికెట్లను ఆన్‌లైన్ ద్వారా ముందుగానే బుక్ చేసుకోవచ్చు. జూ బుకింగ్ కౌంటర్ వద్ద ఉండే క్యూలతో ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. సో..మనల్ని మనమే మరచిపోయి కాస్సేపు సరదాగా..ఉల్లాసంగా..ఉత్సాహంగా గడపడానికి నెహ్రూ జులాజికల్ పార్కు చక్కని వేదిక. అంతేకాకుండా మొబైల్ నావిగేషన్ యాప్‌తో గైడ్ లేకుండానే జూ పార్కును చుట్టి రావచ్చు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని జూ సందర్శనకు వెళితే..జూ పార్కులోని అన్ని ఎన్‌క్లోజర్స్‌తో పాటు ఇతర సమాచారాన్ని మన కళ్ల ముందుంటుంది. గత నెల 1వ తేదీ నుంచి కొత్త రేట్లు అందుబాటులోకి వచ్చాయి. గతంలో పెద్దలకు వీక్ డేస్‌లలో రూ.70, చిన్నారులకు రూ.45 లుగాను..వీకెండ్‌తో పాటు సెలవు రోజుల్లో రూ.80, రూ.55 ఉండగా.. ప్రస్తుతం రెండు కేటగిరీల వారీగా కాకుండా వారం రోజుల్లో పెద్దలకు రూ.100, చిన్నారులకు రూ.50గా నిర్ధారించారు. వీటితో పాటు జూ సందర్శనలో వివిధ కేటగిరీలకు కూడా రేట్లు పెరిగాయి.



నెహ్రూ జులాజికల్ పార్కు

ఆహ్లాదం, వినోదంతో పాటు విజ్ఞానం పంచుతున్న జూ..

నెహ్రూ జులాజికల్ పార్కు ఓ ఎంటర్‌టైన్ మెంట్ పార్కుగా కాకుండా సందర్శకులకు ఆహ్లాదం, వినోదంతో పాటు జంతువు, పక్షులపై కొత్త విషయాలను నేర్చుకునే విద్యాలయంగా చెప్పవచ్చు. దీంతో జూ సందర్శకుల రద్దీ కూడా పెరిగింది. అప్పుడప్పుడు వచ్చే పాఠశాలలు, కళాశాలలకు సెలవులతో పాటు వీకెండ్ రోజులలో జూపార్కును సందర్శించే సందర్శకుల సంఖ్య అధికంగా ఉంటుంది. వేలాది మంది సందర్శకులకు జంతువులు, పక్షులపై ప్రత్యేక అవగాహనను జూపార్కు అధికారులు కల్పిస్తూ జూలో అనేక కొత్త విషయాలను తెలుసుకునే అవకాశం కలిగిస్తున్నారు. కేవలం కాలక్షేపం కోసమే కాకుండా జంతు ప్రపంచం గురించి తెలుసుకునే విజ్ఞాన యాత్రగా జూ పార్కు సందర్శన ఉంటుంది. జూ పార్కును సందర్శించడానికి నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నాయి.

జూ సందర్శనకు పెరిగిన ఆసక్తి..

జూలో లేని జంతువు, పక్షులను రప్పించేందుకు, జంతువు, పక్షుల సంతానోత్పత్తి చేపట్టడం ప్రారంభించాక జూ సందర్శన పట్ల సందర్శకుల్లో అమితమైన ఆసక్తి పెరిగింది. అత్యంత విషతుల్యమైన పాములు, విషం లేని పాములను స్నేక్ సెల్ బృందం ప్రదర్శిస్తూ వాటి వివరాలను సందర్శకులకు తెలియజేస్తూ పాములపై సందర్శకులకు ఉన్న అపోహలను తొలగిస్తున్నారు. అంతేకాకుండా వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ వన్యప్రాణులను దత్తత తీసుకునే వెసులుబాటును కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, కవర్లపై సందర్శకులను చైతన్యవంతులను చేస్తూ ప్లాస్టిక్ నివారణకు కృషి చేస్తున్నారు. సందర్శకులు రోజంతా ఉపశమనం పొందడమే కాకుండా ఆహ్లాదకరమైన చల్లని వాతావరణాన్ని ఆస్వాదిస్తూ వన్యప్రాణులను తిలకించడమే కాకుండా అనేక విషయాలను తెలుసుకోవడం లాంటి అనుభూతులను జూను సందర్శిస్తే కాని తెలియదు.

ఎప్పటికప్పుడు కొత్తదనం..

జూపార్కును అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంతరించిపోయే జంతువు, పక్షుల సంతానోత్పత్తిని చేపట్టేందుకు జూపార్కు కేంద్ర బిందువుగా ఉంది. చిన్నారులు ఆడుకునేందుకు చిల్డ్రన్స్ పార్కు, సేద తీరేందుకు పచ్చిక బయళ్లు, రచ్చబండలు, సహపంక్తి భోజనాలు చేసేందుకు పచ్చని తోరణాలతో విచ్చుకున్న పచ్చదనం జూపార్కు అందచందాలను తిలకించేందుకు విజిటర్ వ్యాన్, లయన్ సఫారీ, చిట్టి రైలు అందుబాటులో ఉన్నాయి.



గుడిమల్కాపూర్‌లో బీజేపీ బస్తీబాట



బస్తీబాటలో బీజేపీ నాయకులు టి.అమర్‌సింగ్, తాళ్ల రాజేష్ తదితరులు

గోల్కొండ: తెలంగాణలో ప్రజాదరణ ఉన్న పార్టీ బీజేపీ ఒక్కటే అని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. మంగళవారం ఆయన బీజేపీ నాయకులతో కలిసి బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి తెలంగాణ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. మరోవైపు పదేళ్ల పాలనలో దేశం ఏవిధంగా అభివృద్ధి చెందింది ప్రధాని మోదీ తీసుకుంటున్న నిర్ణయాలు, తదితర వాటిని ఆయన ప్రజలకు వివరించారు. ఆయన వెంట బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడు తాళ్ల రాజేష్, సీనియర్ నాయకులు జి.సునీల్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు సర్వీస్ మేళా

విజయనగర్‌కాలనీ: ఈ నెల 17న విజయనగర్ కాలనీ బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సర్వీస్ మేళా నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ సెంట్రల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వి.రామనాథం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో కస్టమర్ సేవా ఫిర్యాదులు, బిల్లింగ్ ఫిర్యాదులు వెంటనే పరిష్కరించబడుతాయన్నారు. అంతేకాకుండా కొత్త కనెక్షన్లకు సంబంధించి అన్ని సేవలు, ప్లాన్, టారీఫ్‌లకు సంబంధిచిన వివరాలు అధికారులకు వినియోగదారులచే వివరించబడుతాయన్నారు.

ఊరటనిచ్చిన అకాల వర్షం

చార్మినార్: మండుటెండల్లో మంగళవారం మిట్ట మధ్యాహ్నం రెండున్నర గంటలకు పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో దంచికొట్టిన వర్షం స్థానికులకు ఊరట కలిగించింది. వేసవి ఉక్కపోతను తట్టుకోలేకపోతున్న స్థానికులను వర్షం పలకరించింది. చిరుజల్లులు కాకుండా అరగంట పాటు భారీ వర్షం కురిసింది. వరదనీరు వెళ్లడానికి రోడ్డుకు ఇరువైపులా సరైన మార్గాలు లేకపోవడంతో లోతట్టు రోడ్లలో వరద నీరు నిలిచిపోయింది. ఎక్కడ గోతులున్నాయో..తెలియకపోవడంతో అటు వైపు నుంచి రాకపోకలు సాగించిన వాహనదారులు పడరాని పాట్లు పడ్డారు.



జలమయమైన లోతట్టు రోడ్లు

పైప్‌లైన్‌కు మరమ్మతు



పనులను పరిశీలిస్తున్న తిరుపతి చంద్రశేఖర్

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని అలియాబాద్ ప్రాంతంలో నెలకొన్న కలుషిత తాగునీటి సమస్యను మంగళవారం జలమండలి అధికారులు గుర్తించి పరిష్కరించారు. గత కొన్ని రోజులుగా అలియాబాద్ తదితర ప్రాంతాల్లో కలుషిత తాగునీరు సరఫరా అవుతుండటంతో కంటెస్టెడ్ కార్పొరేటర్ తిరుపతి చంద్రశేఖర్ జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జలమండలి అధికారులు మంగళవారం కలుషిత తాగునీటి సరఫరా జరుగుతున్న పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించారు. ఈ పనులను చంద్రశేఖర్ పరిశీలించారు.

'వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నాం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఈ నెల 19న మజ్లిస్ చేపట్టిన వక్ఫ్ సవరణ బిల్లు నిరసన కార్యక్రమంపై మంగళవారం టోలిచౌకీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఎజెండాను ఒకొక్కటిగా అమలు చేస్తుందని ఆరోపించారు. వక్ఫ్ ఆస్తులు పరిరక్షించి పేద ముస్లింలకు ప్రయోజనం కలిగించే చర్యలు తీసుకునేందుకు చట్టం తేవాలని అలా కాకుండా వక్ఫ్ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం తమ గుప్పిట్లోకి తీసుకోవడం అక్రమం అని ఆయన అన్నారు. తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ముస్లిం ఆస్తుల పరిరక్షణ, నిర్వహణ కోసం వక్ఫ్ బోర్డులు ఉన్నాయన్నారు. ఎక్కడైనా వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం అయితే రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉండాలన్నారు. అలా కాకుండా కేంద్ర ప్రభుత్వమే పెద్దరికం చేస్తూ ముస్లిం మైనార్టీల మనోభావాలను తెబ్బతీయడమే కాకుండా వారి హక్కులను కాలరాస్తున్నారని ఆయన ఆరోపించారు. మజ్లిస్ ఆధ్వర్యంలో ఈ నెల 19న భారీ నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు అజీజ్‌ఖాన్ పటాన్, వజ్జీ ఉజ్‌జమా, హారూన్‌ఫరాన్ తదితరులు పాల్గొన్నారు.

సేఫ్ నైబర్‌హుడ్ అవార్డుల ప్రదానం



ఇన్‌స్పెక్టర్ సురేందర్‌ను అభినందిస్తున్న పోలీసు సిబ్బంది



అవార్డును అందుకుంటున్న ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి

చార్మినార్: సేఫ్ నైబర్‌హుడ్ అవార్డు అందుకున్న హుస్సేనీ ఆలం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సురేందర్‌ను స్టేషన్ ఎస్ఐలతో పాటు ఇతర పోలీసు సిబ్బంది బొకే అందజేసి అభినందించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ చేతుల మీదుగా ఆయన మంగళవారం ఈ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో దక్షిణ మండలంలోని 12 పోలీస్‌స్టేషన్లకు గాను.. హుస్సేనీఆలం పోలీసు స్టేషన్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సుధీర్, నవీన్, నర్సింహ, సిబ్బంది పాల్గొన్నారు.

కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డికి..

సంతోష్‌నగర్: కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డికి సేఫ్ నైబర్‌హుడ్ అవార్డు లభించింది. తాజ్ డెక్కన్‌లోని హెచ్‌సీపీ హెచ్‌సీఎస్‌సీ స్త్రీ సమ్మిట్-2లో కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్‌రెడ్డి నగర పోలీసు కమిషనర్ సి.వి.ఆనంద్ చేతుల మీదుగా సేఫ్ నైబర్‌హుడ్ అవార్డును అందుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి అవార్డును అందుకోవడంపై స్టేషన్ ఎస్సైలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సరోజినీ దేవి-ఎస్ఎండీసీ రోడ్డులో మంగళవారం భారీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. – సాక్షి, సిటీబ్యూరో



సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

గన్‌ఫౌండ్రీ: మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకొని ఈఏఐ ప్రపంచంలో సత్తాను చాటాలని కాళోజి మెడికల్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ పీవీ.నందకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఫిజియో థెరపీ కళాశాల సిల్వర్‌జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మెడికల్ రంగంలో ఫిజియోథెరపీది ప్రధాన పాత్ర అన్నారు. గ్రేడింగ్ సిస్టమ్ పెట్టి సంస్థల మధ్య పోటీని ఇంకా పెంచుతామని తెలిపారు. అంతకు ముందు విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హై పవర్ కమిటీ చైర్మన్ జస్టిస్ ఎ.గోపాల్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐవీఆర్ కృష్ణారావు, ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ప్రకాష్ చంద్ర, కళాశాల అధ్యక్షులు ఉషాకందా, ఉపాధ్యక్షులు కె.లక్ష్మీ సుందరి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.చాయానందిని తదితరులు పాల్గొన్నారు.


న్యూసెన్స్ కేసులో యువకుడికి నెల రోజుల జైలు శిక్ష

చాంద్రాయణగుట్ట: మద్యం మత్తులో బస్తీలలో న్యూసెన్స్ చేస్తున్న యువకుడికి నాంపల్లి న్యాయస్థానం నెల రోజుల జైలు శిక్షను విధించింది. చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గురునాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. జీఎం కాలనీకి చెందిన అబ్దుల్ రెహాన్(20) అనే యువకుడు కొన్ని రోజులుగా మద్యం తాగి బస్తీల్లో న్యూసెన్స్ చేయడంతో పాటు రాత్రిపూట అనుమానాస్పందంగా సంచరిస్తున్నాడు. బస్తీవాసుల ఫిర్యాదు మేరకు చాంద్రాయణగుట్ట పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టారు. కేసును విచారించిన న్యాయమూర్తి రెహాన్‌కు నెల రోజుల జైలు శిక్షను విధించారు.

కోర్సులను సద్వినియోగం చేసుకోండి

శాలిబండ: చందులాల్ బారాదరిలోని కులీ కుతుబ్‌షా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అందుబాటులో వివిధ కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్, కో ఆర్డినేటర్ పి.పరమేశ్వర్, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ వి.వంశీ విక్రమ్‌లు తెలిపారు. కులీ కుతుబ్‌షా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రిషియన్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్‌తో పాటు డిప్లొమా ఇన్ ప్రింటింగ్ టెక్నాలజీ కోర్సు ఇక్కడ అందుబాటులో ఉందన్నారు. ఈ అవకాశాన్ని పాలిసెట్ అర్హత సాధించిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాలుడి అదృశ్యం



రామ్

నాంపల్లి: బాలుడు అదృశ్యమైన ఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..మాన్గార్ బస్తీలో నివాసం ఉండే ఉప్పాడే సునీత, లక్ష్మణ్‌ల కుమారుడు రామ్(08) మానసిక స్థితి సరిగా లేదు. ఈనెల 13న మధ్యాహ్నం నుంచి రామ్ కనిపించకుండా పోయాడు. అన్ని ప్రదేశాల్లో, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచుకీ లభించలేదు. దీంతో సునీత తన కుమారుడు కనిపించడం లేదంటూ హబీబ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చంపేస్తాడని భయపడి చంపేశారు!

రౌడీషీటర్ హత్య కేసులో నిందితుల రిమాండ్



వివరాలను వెల్లడిస్తున్న దక్షిణ మండలం ఇన్‌చార్జి డీసీపీ శ్వేత, ఏసీపీ వెంకటేశ్వర్ రావు

డబీర్‌పురా: రౌడీషీటర్ హత్య కేసులోని నిందితులను రెయిన్‌బజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం పురానీహవేలిలోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దక్షిణ మండలం ఇన్‌చార్జి డీసీపీ శ్వేత, మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు, ఇన్‌స్పెక్టర్ రమేశ్ నాయక్, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ వి.మదన్‌లాల్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. ఫలక్‌నుమా ఫాతిమానగర్‌కు చెందిన మహ్మద్ మసీవుద్దీన్ (27)పై ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా నమోదైంది. మార్చి 23న డబీర్‌పురా దర్వాజా ప్రాంతానికి చెందిన మహ్మద్ ఉమర్ ఖాన్ (29) డబీర్‌పురా దర్వాజా వద్ద వాటర్ మిలన్ (పుచ్చకాయలు)బండిపై విక్రస్తుండగా మసీవుద్దీన్ వచ్చి వ్యాపారం చేయాలంటే రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా దానికి ఉమర్‌ఖాన్ నిరాకరించాడు. అదేరోజు సాయంత్రం మరోసారి వచ్చిన మసీవుద్దీన్ (తుమ్ ఖర్బూజే కత్రో..మై తుమారా సర్ కాటుంగా (మీరు ఖర్బుజాలు కట్ చేయండి..నేను మీ తల నరకాతా) అంటూ హెచ్చరించి వెళ్లిపోయాడు. రౌడీషీటర్ మసీవుద్దీన్‌తో తన ప్రాణాలకు ఎలాగైనా హాని ఉందని.. రౌడీషీటర్‌ను హత్య చేయాలని పథకం వేసిన మహ్మద్ ఉమర్ ఖాన్, మహ్మద్ పాషా జిలానీ, మహ్మద్ ఆరీఫ్ ఖాన్ స్నేహితులైన డబీర్‌పురాకు చెందిన మహ్మద్ గౌసుద్దీన్ (36), మహ్మద్ తబ్రేజ్ ఆలియాస్ తబ్బు (29), సయ్యద్ ఇబ్రహీం (36), సయ్యద్ బషీర్ అలియాస్ బషీర్ ఖాన్ (40), మహ్మద్ అబుబాకర్ అలియాస్ అబ్బు (40)తో కలిసి ఈ నెల 13న ఫర్హత్‌నగర్ షాజీ హౌస్ మసీవుద్దీన్ కోసం వేచి ఉన్నారు.పెళ్లి పత్రికలు తీసుకుని బంధువులకు ఇచ్చేందుకు వెళ్తున్న మసీవుద్దీన్ డిలక్స్ మెడికల్ షాపు వద్ద వేచి ఉన్నాడనే సమాచారంతో ఎనిమిది మంది కలిసి అక్కడికి చేరుకొని కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేసి పారిపోయారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం సంతోష్‌నగర్ యాదగిరి థియేటర్ వద్ద నిందితులను అరెస్ట్ చేసి నాలుగు కత్తులు, రెండు యాక్టివాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న కత్తులు, సెల్‌ఫోన్లు

బీసీలను చైతన్య పరచడమే లక్ష్యం



మాట్లాడుతున్న కటకం నర్సింగ్‌రావు

గన్‌ఫౌండ్రీ: బీసీల రాజకీయ చైతన్య మార్పు కోసమే మన ఆలోచన, సాధన సమితి పనిచేస్తుందని మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపకులు కటకం నర్సింగ్ రావు తెలిపారు. మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో మన ఆలోచన సాధన సమితి ఆవిర్భావ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామీణ స్థాయిలో బీసీలను చైతన్య పరచడమే లక్ష్యంగా పని చేయనున్నట్లు వెల్లడించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయినప్పటికీ ఉత్పత్తి సేవా కులాలు కులవృత్తులుగానే మిగిలి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ మాట్లాడుతూ..బీసీలందరు ఏకమై రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్.రాములు, సాధన సమితి వ్యవస్థాపక సభ్యులు గడ్డం నర్సింహా గౌడ్, జేఎన్‌టీయూ మాజీ వైస్ చాన్స్‌లర్ గడ్డం తులసి రామ్‌దాస్, సినియర్ జర్నలిస్ట్ వెంకట్ నారాయణ, తెలంగాణ హై కోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.జగన్ పాల్గొన్నారు.

సన్మానం



కల్యాణ్ ముఖర్జీని సన్మానిస్తున్న బీఎస్ మధుసుదన్ తదితరులు

అబిడ్స్: తెలంగాణ కెనరా బ్యాంక్ సర్కిల్ హెడ్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన కల్యాణ్ ముఖర్జీకి కెనరా బ్యాంకు తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. యూనియన్ సెక్రటరీ బీఎస్ మధుసూదన్ బ్యాంకు హెడ్ కల్యాణ్ ముఖర్జీకి పూల బొకే ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీఎస్ మధుసూదన్ మాట్లాడుతూ..నూతన హెడ్‌గా కల్యాణ్ ముఖర్జీ పదవీ బాధ్యతలను స్వీకరించడం సంతోషకరమన్నారు. ఆయన నేతృత్వంలో బ్యాంకు అభ్యున్నతికి అధికారులు ఉద్యోగులంతా కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంజుల, వినయ్‌కుమార్, వికాస్, మోహన్ రాజ్, శంకర్ రెడ్డి, హనుమాన్‌రాజ్, శంకర్‌రెడ్డి, హనుమాన్, సతీష్ కుమార్, గొరిగే శ్రీనివాస్ పాల్గొన్నారు.